www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 18 జనవరి 2025 5 పశ్చిమ గోదావరి



రేపు కార్మిక, కర్షక ఐక్యతా దినోత్సవ సభ

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 19న కార్మిక, కర్షక ఐక్యతా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ పిలుపునిచ్చారు. సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం. కౌలురైతు సంఘాల సంయుక్త సమావేశం ప్రజాసంఘాల కార్యాలయంలో జక్కంశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలని, ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, కౌలురైతులకు రుణార్హత కార్డులు ఇవ్వాలని కోరుతూ అఖిలభారత కమిటీలు ఇచ్చిన పిలుపులో భాగంగా ఈ నెల 19న ప్రకాశంచౌక్‌లో సభ నిర్వహిస్తున్నామని, దీనిలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎం.ఆంజనేయులు, ఎ.అలమహారాజు, ఇంజేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సినిమాకెళ్తే జేబుకు చిల్లే..!

- సినిమా హాళ్లలో తినుబండారాల ధరల మోత
- పాప్‌కార్న్ ధర పెద్దది రూ.వంద, చిన్నది రూ.50
- రూ.పది ఖరీదు చేసే దిల్‌పసంద్ రూ.30
- చిన్నపాటి సమోసా ధర రూ.8
- ఫోన్‌పే, గూగుల్ పే వంటి ఆన్‌లైన్ చెల్లింపులు కుదరవని హుకుం
- మొద్దునిద్రలో తనిఖీ అధికారులు
- రెండు జిల్లాల్లో 40కుపైగా థియేటర్లపై పర్యవేక్షణ కరువు



ఏలూరు నగరంలోని ఓ సినిమా థియేటర్‌లో తినుబండారాల దుకాణాలు

సామాన్య ప్రజానీకానికి సినిమా వినోదం భారంగా మారింది. సినిమాకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. సినిమా విడుదలైన తర్వాత పది రోజులపాటు సినిమా టిక్కెట్ల ధరల పెంపునకు ప్రభుత్వాలు అనుమతిస్తున్నాయి. టిక్కెట్ల భారానికి తోడు సినిమా హాళ్లలో తినుబండారాల ధరలకు అడ్డూఅదుపు లేకుండాపోయింది. సినిమా హాళ్లలో నిబంధనల అమలు చేయాల్సిన అధికారులు మొద్దు నిద్ర నటిస్తున్నారు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో 40కుపైగా సినిమా థియేటర్లు ఉన్నాయి. ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు వంటి పట్టణాల్లో పదుల సంఖ్యలో థియేటర్లు ఉండగా పలు మండల కేంద్రాల్లోనూ సినిమా థియేటర్లు కొనసాగుతున్నాయి. సంక్రాంతి పండుగకు కొత్త సినిమాలు గేమ్‌ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహారాజ్ వంటి పెద్ద హీరోల సినిమాలు విడుదలయ్యాయి. పండుగ నేపథ్యంలో సినిమా చూసేందుకు వెళ్తున్న జనాలను సినిమా హాళ్లలో తినుబండారాల ధరల పేరుతో పీక్కుతింటున్న పరిస్థితి ఉంది. నిబంధనల ప్రకారం సినిమా హాళ్లలో తినుబండారాల ధరలకు సంబంధించి పట్టిక రూపంలో ప్రదర్శించాలి. ఆ పని పెద్దగా జరగడం లేదు. దీంతో తినుబండారాల ధరలు భారీగా పెంచేసి ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. చిన్నపాటి దిల్‌పసంద్ ముక్క మార్కెట్లో రూ.పది నుంచి రూ.15కు విక్రయిస్తుండగా ఏలూరు సత్యనారాయణ థియేటర్‌లో రూ.30కు విక్రయిస్తున్న పరిస్థితి ఉంది. మిగిలిన సినిమా హాళ్లలోనూ ఇదే పరిస్థితి. ఇక పాప్‌కార్న్ ధర పెద్దప్యాకెట్ రూ.వంద, చిన్నప్యాకెట్ రూ.50కు అమ్ముతున్నారు. చిన్నపాటి సమోసాలు బయట రూ.నాలుగుకు విక్రయిస్తుండగా, సినిమా హాల్‌లో రూ.ఎనిమిది వరకూ అమ్ముతున్నారు. ఇక కూల్‌డ్రింక్స్, ఇతర తినుబండారాలకు సైతం పెద్దఎత్తున ధర నిర్ణయించి వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. తినుబండారాలు కొనుగోలు చేసిన వారు నగదు రూపంలో మాత్రమే చెల్లింపులు చేయాలని నిబంధన పెడుతున్నారు. ఫోన్‌పే, గూగుల్‌పే వంటి ఆన్‌లైన్ చెల్లింపులు కుదరవని హుకుం జారీ చేస్తున్నారు. ఆన్‌లైన్ చెల్లింపు జరిగితే అక్కడ ధరల విషయం బయటికి తెలిసిపోతుందని ఆంక్షలు పెడుతున్న పరిస్థితి ఉంది. తినుబండారాల ధరలపై ఎవరైనా ప్రశ్నిస్తే దురుసుగా ప్రవరిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో సినిమా టిక్కెట్ ధరలతోపాటు తినుబండారాలకు భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. నలుగురు సభ్యులున్న కుటుంబం సినిమాకు వెళ్తే టిక్కెట్లకు రూ.1200, తినుబండారాలకు మరో రూ.400 దాదాపు రూ.1600 వరకూ ఖర్చవుతోంది.

వేలాది మంది సమస్యపై తీవ్ర నిర్లక్ష్యం

రెండు జిల్లాల్లో 40కుపైగా సినిమా థియేటర్లు ఉండగా ప్రతిరోజూ నాలుగు షోలు వేస్తుంటారు. పండుగ సీజన్ కావడంతో ఐదు షోలు కూడా వేస్తున్నారు. ప్రతిరోజూ వేలాది మంది సినిమా చూస్తుంటారు. ఇంతమంది జనం ఇబ్బందులు పడుతున్నా సినిమా హాళ్లలో నిబంధనల అమలుపై రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సినిమా హాళ్ల యజమానులు ఇష్టానుసారంగా రెచ్చిపోతున్నారు. తినుబండారాల ధరలు, నాణ్యతకు సంబంధించి అధికారులు ఎందుకు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవడం లేదో అర్థం కాని పరిస్థితి. జనం పెద్దఎత్తున వెళ్లే సినిమా హాళ్లలో తినుబండారాలు, ఇతర నిబంధనలను కచ్చితంగా అమలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జనం కోరుతున్నారు.

గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఈ నెల 26న కలెక్టరేట్ పెరేడ్ గ్రౌండ్‌లో 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వశిష్ఠ సమావేశ మందిరంలో గణతంత్ర వేడుకలకు సంబంధించి అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆహుతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా తాగునీటి వసతి తదితర అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై శకటాలు సిద్ధం చేయాలని, ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్‌పి ఆధ్వర్యంలో యధావిధిగా కార్యక్రమాల నిర్వహణతోపాటు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దేశభక్తి గీతాలతో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించేలా ఏర్పాట్లు చేయాలని డిఇఒను ఆదేశించారు. రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్, పోలీసు, సమాచార శాఖ, సంక్షేమ శాఖలు, విపత్తు అగ్నిమాపక శాఖ, వైద్యఆరోగ్యం, పౌర సరఫరాలు తదితర శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ మొగలి వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్‌పి వి.భీమారావు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, డిఇఒ ఇ.నారాయణ, ఎపీసీ పి.శ్యాంసుందర్, డిపిఆర్‌ఒ టి.నాగేశ్వరరావు, డిపిఒ బి.అరుణశ్రీ, జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డ్వామా పీడీ డాక్టర్ కెసిహెచ్.అప్పారావు, ఇరిగేషన్ అధికారి నాగార్జునరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌వి.ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఇ బివివి.నాగేశ్వరరావు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి బి.శ్రీనివాసరావు, సివిల్ సప్లయిస్ డిఎం టి.శివరామప్రసాద్, డిఎస్‌ఒ ఎన్.సరోజ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ భానునాయక్, జిల్లా ఉద్యానవన శాఖాధికారి మురళీకృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖాధికారి యు.మంగపతిరావు, జిల్లా చేనేత అధికారి అప్పారావు, డిఎఫ్‌ఒ డి.ఆశాకిరణ్, తహశీల్దార్ రావి రాంబాబు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛతా కార్యక్రమాలు

జిల్లాలో ఇకపై ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వహణకు చర్యలు చేపట్టామని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆమె వివిధ శాఖల జిల్లా అధికారులతో సమావేశమై మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పట్టణ స్థాయి నుండి గ్రామ స్థాయి అధికారుల వరకు ప్రతిఒక్కరూ అంకితభావంతో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దీనిలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖలు కీలక భూమిక పోషించాల్సి ఉందన్నారు.

దేశ రాజకీయాల్లో జ్యోతిబసుది చెరగని ముద్ర

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్



జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - భీమవరం

కమ్యూనిస్టు పార్టీ తొలితరం నాయకులు, సిపిఎం నేత, పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి జ్యోతిబసు దేశ రాజకీయాల్లో చెరగని ముద్ర వేశారని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అన్నారు. మెంటేవారితోటలోని స్థానిక సుందరయ్య భవనం వద్ద జ్యోతిబసు 14వ వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతిబసు చిత్రపటానికి గోపాలన్ పూలమాల వేసి ఘన నివాళులర్పించి మాట్లాడారు. దేశ రాజకీయాల్లోనే చరిత్ర సృష్టించిన వ్యక్తి జ్యోతిబసు అన్నారు. పశ్చిమబెంగాల్‌ను కాంగ్రెస్ పరిపాలిస్తున్న సమయంలో ఎమర్జెన్సీ పెట్టి ప్రజలపై విపరీతమైన నిర్బంధం విధించిన సందర్భంలో అక్కడి ప్రజలకు సిపిఎం అండగా నిలబడిందన్నారు. అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిందన్నారు. ఆ పోరాటాల ఫలితంగా 1977లో జరిగిన ఎన్నికల్లో లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 35 సంవత్సరాలపాటు నిర్విరామంగా అధికారంలో ఉందని, అనేక విప్లవాత్మకమైన మార్పులతో ప్రజలకు విశేష సేవలందించిందని అన్నారు. 1977 నుండి 2000వ సంవత్సరం వరకు జ్యోతిబసు ముఖ్యమంత్రి పదవిని ఐదుసార్లు చేపట్టారన్నారు. భూసంస్కరణలు చేపట్టి భూమిలేని పేదలందరికీ భూమి ఇచ్చిన ఘనత సిపిఎందేనన్నారు. ఎన్‌టి.రామారావు, ఫరూక్ అబ్దుల్లా, రామకృష్ణ హెగ్డే, దేవగౌడ, కరుణానిధి వంటి వారితో కలిసి కాంగ్రెస్ నియంతృత్వానికి వ్యతిరేకంగా, రాష్ట్రాలపై దాడులకు వ్యతిరేకంగా, హక్కుల కోసం జ్యోతిబసు నిలబడ్డారన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం రాష్ట్రాల హక్కుల్ని హరిస్తోందన్నారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, పోలవరం ప్రాజెక్టుకు, రాజధాని నిర్మాణానికి నిధులు ఇవ్వకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై, బిజెపి నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా నిరంతర పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, కె.క్రాంతిబాబు, ఇంజేటి శ్రీను, నేతలు మల్లిపూడి ఆంజనేయులు, బి.అలమహారాజు, దత్తు, కె.రత్నకుమారి పాల్గొన్నారు.



కోపల్లెలో నాట్లు వేస్తున్న కూలీలు

సా..గుతున్న దాళ్వా నాట్లు



వరినారును ట్రాక్టర్ ద్వారా తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - కాళ్ల

సంక్రాంతి పండుగ ముగిసింది. డెల్టాలో ఇంకా దాళ్వా వరినాట్లు కొన సాగుతున్నాయి. దాళ్వా సాగు వివిధ దశల్లో ఉంది. ఆకివీడు సబ్ డివిజన్‌లో 20,165 ఎకరాల్లో దాళ్వా సాగవుతోంది. దీనిలో 60 శాతం వరకూ నాట్లు పూర్తయ్యాయి. ముందస్తుగా నారుమళ్లు వేసిన రైతులు ఇప్పటికే నాట్లు పూర్తి చేశారు. ప్రస్తుతం వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నెలాఖరుకు నాట్ల ప్రక్రియ పూర్తయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఎంటియు 1156, 1153 వరి రకాలతోపాటు పలు రకాల విత్తనాలను ఎక్కువమంది సాగు చేస్తున్నారు. నారుమళ్లు పూర్తయిన చేలల్లో కొన్నిచోట్ల నారు మిగలడంతో ఇతర ప్రాంతాలకు వరినారును విక్రయిస్తున్నారు. పలు గ్రామాల నుంచి వరినారును ఏలూరు జిల్లాకు ఎగుమతి చేస్తున్నారు. వరినారుకు డిమాండ్ పెరిగింది.

నెలాఖరు నాటికి నాట్లు పూర్తి చేయాలి
కెవిఎస్.శ్రీనివాస్, ఆకివీడు ఎడిఎ

ఈ నెలాఖరు నాటికి వరి నాట్లు పూర్తి చేయాలి. ముందస్తు సాగుతో మేలైన దిగుబడులు సాధించొచ్చు. అవసరాన్ని మించి పురుగు మందులు, ఎరువులు వాడొద్దు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి.

హోరాహోరీగా కబడ్డీ పోటీలు

నేడు బహుమతుల ప్రదానోత్సవ సభ



ఆడుతున్న క్రీడాకారులు


ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని రుస్తుంబాద కబడ్డీ స్టేడియంలో శ్రీ గోగులమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయస్థాయి మహిళా, పురుషుల కబడ్డీ పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. సెమీఫైనల్స్‌లో చోటు దక్కించుకునేందుకు జట్లు మెరుగైన ఆట తీరుతో తలపడ్డాయి. దీంతో పోటీలు ఆసక్తికరంగా సాగాయి. పురుషుల విభాగంలో సిఆర్‌పిఎఫ్ ఢిల్లీ, ఆంధ్ర, నవీన్ యుపి, మహిళల విభాగంలో సిఆర్‌పిఎఫ్ ఢిల్లీ, రాజస్తాన్, కేరళ జట్లు ముందంజలో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మ్యాచ్‌లకు నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద విచ్చేసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మ్యాచ్‌లను నిర్వాహకులతో కలిసి తిలకించారు. శనివారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది. విజేతలకు బహుమతుల ప్రదానోత్సవ సభలో కలెక్టర్ సిహెచ్.నాగరాణి, ఎస్‌పి అద్నాన్‌నయీమ్ అస్మి హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోగులమ్మ ఉత్సవ కమిటీ కన్వీనర్ కొత్తపల్లి జానకీరామ్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ సిఇఒ వీరలంకయ్య, పద్మజ బాల, కమిటీ సభ్యులు అడబాల బాబులు, గోపీ, చినిమిల్లి మమ్ము, కొప్పినీడి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పెన్షన్ల తనిఖీ

ప్రజాశక్తి - కాళ్ల

మండలంలో 10 గ్రామ సచివాలయాల్లో వికలాంగుల పెన్షన్ల తనిఖీ శుక్రవారం నిర్వహించారు. శుక్రవారం మొదటి రోజు రూ.15 వేలు పెన్షన్ తీసుకుంటున్న వికలాంగులైన పెన్షన్‌దారుల ఇళ్లకు వెళ్లి అధికారులు పరిశీలించారు. బొండాడ, బొండాడపేట, పెదఅమిరం, జక్కరం, కోపల్లె, కోలనపల్లి, ఎల్ఎన్‌పురం, సీసలి, వేంపాడు గ్రామాల్లో మొత్తం 24 పెన్షన్లు తనిఖీ చేశారు. మిగిలిన తొమ్మిది గ్రామ సచివాలయాల పరిధిలోని పెన్షన్లను శనివారం తనిఖీ చేయనున్నామని ఎంపిడిఒ జి.స్వాతి తెలిపారు. ఈ తనిఖీల్లో జి.రవికుమార్, సుహాస్, ఎస్.సునీల్, డి.సునీత, జి.స్వాతి, మెడికల్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వేంపాడు గ్రామ సచివాలయంలో హెల్త్ పెన్షన్ల తనిఖీ చేస్తున్న దృశ్యం



ప్రథమ బహుమతి అందుకుంటున్న రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల విజేతలు

ఆహారంతోపాటు క్రీడలూ ప్రధానమే

చెడుగుడు పోటీల ముగింపు సభలో వైద్యులు ప్రతాప్‌కుమార్

ప్రజాశక్తి - ఆకివీడు

మనిషికి ఆహారం ఎంత ప్రధానమో, క్రీడలు అంతే ప్రధానమని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు, డివైఎఫ్ఐ యువజనోత్సవాల ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులు డాక్టర్ పిబి.ప్రతాప్‌కుమార్ అన్నారు. డివైఎఫ్ఐ సంక్రాంతి యువజనోత్సవాల్లో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రధాన సభకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రతాప్‌కుమార్ మాట్లాడారు. యువత, సమాజ హితం కోరి 42 సంవత్సరాలుగా డివైఎఫ్ఐ ఈ క్రీడలు నిర్వహిస్తోందన్నారు. ప్రతిఒక్కరిలో క్రీడాస్ఫూర్తి పెరగాల్సిన అవసరం ఉందని, క్రీడాస్ఫూర్తితో సమాజంలో ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. క్రీడాస్ఫూర్తితో సమస్యలకు పరిష్కారంతోపాటు ఆరోగ్యం, ఆనందం, సామాజిక స్పృహ, చైతన్యం వంటి ఎన్నో అంశాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఈ క్రీడలను ప్రాథమిక విద్యాస్థాయి నుండి అలవర్చాల్సిన అవసరాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలన్నారు. రైస్‌మిల్లర్ గంధం ఉమా సత్యనారాయణ మాట్లాడుతూ శారీరక ఆరోగ్యానికి క్రీడలు మంచి ఔషధం వంటివన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు అంబటి రమేష్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, న్యాయవాది నెల్లి సతీష్‌కుమార్, జనసేన నాయకులు తోట వాసు, అట్లు రంగారావు, కొల్లి వెంకన్నబాబు, క్రీడల ఆహ్వాన సంఘం కన్వీనర్ దోకల రవితేజ, నిర్వహణా కమిటీ సభ్యులు బొడ్డుపల్లి రాంబాబు, బివి వర్మ, పెంకి అప్పారావు, కె.తవిటి నాయుడు, సందక సూరిబాబు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం పటిష్టంగా చేపట్టాలి

ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ బొలిశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణంలో 30 ఏళ్ల పాటు నిలిచి ఉండేలా రోడ్లు నిర్మించాలని కాంట్రాక్టర్లకు ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం పట్టణంలో సుమారు రూ.1.40 కోట్లతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. 30వ వార్డు కట్టావారి వీధిలో సుమారు రూ.17 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి, 28వ వార్డు అరవవారివీధిలో గోయంక ఉమెన్స్ కాలేజీ వరకూ సుమారు రూ.10.20 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి, టీచర్స్ కాలనీలో రైల్వే ట్రాక్ రోడ్డు వరకూ రూ.10 50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అలాగే 15వ వార్డు సావిత్రీపేటలో కబేల రోడ్డులోని నుండి సిద్ధేశ్వర రైస్‌మిల్లు వరకూ రూ.98 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ స్థానికులు దగ్గరుండి రహదారులు నాణ్యతతో నిర్మాణం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాజ్జీ, మున్సిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ ఇంజినీర్ వెంకటరమణ, బిజెపి నాయకులు నరసింహేశ్వరరావు,కూటమి నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి



తణుకు : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ ఆరిమిల్లి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి తెలిపారు. భీమవరం డిపో వద్ద రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రారంభం కార్యక్రమం డిపో మేనేజర్ పిఎన్‌విఎం.సత్యనారాయణ మూర్తి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన గోదావరి జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమా మహేశ్వరరావు, వన్ టౌన్ సిఐ నాగరాజు పాల్గొన్నారు. ముఖ్యఅతిథి శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ రంగసాయి మాట్లాడారు. ప్రయాణికుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా డ్రైవర్లు నిర్లక్ష్యాన్ని వీడి నిబంధనలు పాటించాలన్నారు. ప్రజా రవాణా అధికారి ఎన్‌విఆర్.వరప్రసాద్ మాట్లాడుతూ ఆర్‌టిసి బస్‌లో ప్రయాణం సురక్షితం అన్నారు. రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్‌కు, మద్యానికి డ్రైవర్ దూరంగా ఉండడం మంచిదన్నారు. సిఐ నాగరాజు మాట్లాడుతూ గతంలో వారోత్సవాలు జరుపుకునే వారమని, నేడు భద్రతా మాసోత్సవాలు జరుపుకోవడం అభినందనీయమని తెలిపారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు.

తణుకు : వాహనదారులు విధిగా హెల్మెట్, సీట్ బెల్టు ధరించి, రోడ్డు నిబంధనలు పాటించాలని తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ సూచించారు. శుక్రవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు - 2025 సందర్భంగా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఎంఎల్ఎ రాధాకృష్ణ స్థానిక క్యాంపు కార్యాలయంలో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ వాహనదారుల అజాగ్రత్త వల్లే రోడ్డు ప్రమాదాలకు గురౌతున్నారని, రహదారి నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో తణుకు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.



సీనియర్ అకౌంట్స్ అధికారి బాలాజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న పెన్షనర్లు

పెన్షనర్స్ అసోసియేషన్‌కు అభినందనలు

అమరావతి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ బాలాజీ

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం సబ్ ట్రెజరీ కార్యాలయానికి తనిఖీ నిమిత్తం వచ్చిన అకౌంటెంట్ జనరల్, అమరావతి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ ఎస్.బాలాజీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సమిష్టిగా పెన్షనర్స్‌కు వివిధ రకాల సేవలు అందజేయడం అభినందనీయమన్నారు. పెన్షనర్స్ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు గాతల జేమ్స్, భీమవరం యూనిట్ ప్రధాన కార్యదర్శి పి.సీతారామరాజు, కోశాధికారి పివిఆర్ ఎస్ఎస్.సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీ అప్పన సత్యనారాయణ, కెవివి.ముత్యాలరావు, కార్యవర్గ సభ్యులు కె.చంద్రరావు, ఆర్ఎస్.సూర్యనారాయణ, సీనియర్ పెన్షనర్ భైర్రాజు సత్యనారాయణ రాజులు బాలాజీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప ఖజానాధికారి అల్లూరి రవివర్మ, ట్రెజరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పాండురంగారావు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బాలింతలకు కిట్లు పంపిణీ చేస్తున్న మానవతా సభ్యులు

చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి - ఆచంట

చలికాలంలో తల్లిదండ్రులు చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మానవత మండల అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాద్ అన్నారు. మానవత ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రంగి రెడ్డి నాగజ్యోతి, కేతా ధనలక్ష్మి ఇటీవల పండంటి బిడ్డలకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా బిడ్డల సౌకర్యార్థం మానవత ఆధ్వర్యంలో బేబీ కిట్స్, ఔషధాలు, రస్కులు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బొక్కా రామకృష్ణ కోశాధికారి తమ్మినీడి సత్యనారాయణమూర్తి, జిల్లా మానవత ఆడిట్ కమిటీ మెంబర్ నెక్కంటి శివన్నారాయణ, సహాయ కార్యదర్శి మానేపల్లి వెంకటేశ్వరరావు, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ గుండా బత్తుల ఆనందకుమార్, అడ్వయిజరీ కమిటీ సభ్యులు సజ్జా నారాయణ, డాక్టర్ రామాంజనేయులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్ డైరెక్టర్ కృష్ణంరాజు

ప్రధాని పరీక్ష పే చర్చలో ఆదిత్య విద్యార్థి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఆదిత్య స్కూల్ విద్యార్థి బిఎన్ఎస్ శశికాంత్ ప్రధాని మోడీ పరీక్ష పే చర్చ - 2025 8వ ఎడిషన్ కార్యక్రమంలో పాల్గొన్నట్లు స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు శుక్రవారం తెలిపారు. ఈ నెల 13, 14 తేదీల్లో న్యూఢిల్లీలో మినిస్టర్ ఆఫ్ ఎడ్యుకేషన్, డిపార్ట్మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ లీటరసీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. విద్యార్థి శశికాంత్, గైడ్ టీచర్ వెంకటేశ్వరరావు హాజరయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా శశికాంత్‌కు అభినందన కార్యక్రమం స్కూల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్, బి.యుగసుధ, సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో కోడుమూరు ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కర్నూలు జిల్లా కోడుమూరు నియోజకవర్గం ఎంఎల్ఎ బొగ్గుల దస్తగిరి మావుళ్లమ్మను శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ ఇఒ బుద్ధ మహాలక్ష్మి నగేష్, అర్చకులు ఆలయ మర్యాదలతో ఘనంగా అమ్మవారి ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ పాల్గొన్నారు.



ఎంఎల్ఎకు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారులు

మావుళ్లమ్మను దర్శించుకున్న శ్యామలాదేవి

భీమవరం టౌన్ : భీమవరం మావుళ్లమ్మను దివంగత కేంద్ర మాజీ మంత్రి ఉప్పలపాటి కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ ఇఒ బుద్ధా మహాలక్ష్మి నగేష్ వారికి స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనం అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పద్మ, వెంకటేశ్వర్లురాజు, జిల్లా ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షులు ఉండి వాసు, మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షులు చల్లా రాము పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - మొగల్తూరు

రామన్నపాలెం పంచాయతీ పిప్పళ్లవారితోటలోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో శుక్రవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 2006-07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆత్మీయంగా కలుసుకున్నారు. ఒకరినొకరు కలుసుకొని పలకరించుకున్నారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పాఠశాల ఆవరణలో ఆహ్లాదంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు.



ఆనాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అసంపూర్తిగా కల్వర్టు..!

తరచూ ప్రమాదాలు

పట్టించుకోని ఆర్అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి - గణపవరం

మండలంలో సరిపల్లి శివారున ఉన్న కల్వర్టుకు ఇరువైపులా నిర్మించాల్సిన సిమెంటు గోడలు ఆర్అండ్‌బి అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. దీంతో ఈ ప్రాంతంలో తరచూ వాహనదారులు ప్రమాదాల బారినపడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నా ఆర్అండ్‌బి అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరిపల్లి శివారున ఉన్న సిపిఎస్ ఫ్యాక్టరీ దాటిన తరువాత భీమవరం వెళ్లే రహదారికి మలుపు ఉంది. అయితే మలుపు వద్ద అధికారులు ఎటువంటి హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయలేదు. దీంతో వాహనదారులు రోడ్డు మార్జిన్‌లోకి రావడంతో వాహనం అదుపుతప్పి వంతెనకాలువలో పడిపోయి ప్రాణాలను పోగొట్టుకుంటున్నారు. అధికారులు వెంటనే కల్వర్టుకు పూర్తిస్థాయిలో గోడలు నిర్మిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. గణపవరంలో ఆర్అండ్‌బి కార్యాలయం ఉన్నప్పటికీ కార్యాలయంలో అధికారులు ఎవరూ ఉండక పోవడం, రహదారులు, కల్వర్టుల పట్ల తగిన పరిశీలన లేక పోవడంతో వాహనదారులకు ప్రమాదాలు కలుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు కల్వర్టుకు పూర్తిస్థాయిలో గోడలు నిర్మించి ప్రమాదాలను నివారించాలని కోరుతున్నారు.



సరిపల్లి శివారున ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

కృష్ణమూర్తి మృతికి పలువురు సంతాపం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని మాముడూరు గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతిపరులు, రజక సంఘం నేత పొలమూరి కృష్ణమూర్తి (78) మృతికి శుక్రవారం పలువురు సంతాపం తెలిపారు. ఇటీవల మృతి చెందిన కృష్ణమూర్తికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు,మనవళ్లు, మనవరాళు ఉన్నారు. గ్రామంలో సిపిఎం కార్యక్రమాల్లో ఆయన చురుగ్గా పాల్గొనేవారని తెలిపారు. ఆయన కుటుంబాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం, కేతా గోపాలన్ పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో రైతు సంఘం నాయకులు ఆకుల హరేరామ్, మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్, కె.సుబ్బరాజు, నేతల చిత్త రంజన్, రజక సంఘ జిల్లా నాయకులు వుడక రాజు, రాజేంద్ర ఉన్నారు. ఈ నెల 19వ తేదీ ఆదివారం మాముడూరులో రజక సంఘం ఆధ్వర్యంలో కృష్ణమూర్తికి నివాళులర్పిస్తూ సంస్మరణ సభ జరుపుతున్నట్లు రజక సంఘం జిల్లా నాయకులు వుడక రాజు తెలిపారు.



కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బలరాం, గోపాలన్

చెడుగుడు పోటీల్లో విజేతలు వీరే

ఆకివీడు: డివైఎఫ్ఐ రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలను జంటగా రెండు టీములు కైవసం చేసుకున్నాయి. అయిభీమవరం - ఏలూరుపాడు టీంలు విజయాన్ని సాధించాయి. మూడు రోజులపాటు జరిగిన చెడుగుడు పోటీల్లో మొత్తం 16 టీముల్లో ఆరు టీమ్‌లు లీగ్‌గా అర్హత సాధించాయి. వాటిలో కైకలూరు, కోరుకొల్లు టీములు జంటగా ఒకే పాయింట్లు సాధించడంతో 5, 6 స్థానాలు సాధించి బహుమతులను సమానంగా పంచుకున్నాయి. కమత వానీగూడెం 4వ స్థానం, ప్రకాశం జిల్లా చీరాల టీం మూడో స్థానాన్ని సాధయించాయి. ఇక ఒకటి, రెండు స్థానాలకు సంబంధించి బహుమతులను ఏలూరుపాడు టీములు చెరో ఎనిమిదేసి పాయింట్లు సాధించి సమాన పాయింట్లతో నిలవడంతో వారు ఇరువురిని విజేతలుగా ప్రకటించారు. న్యాయనిర్ణేతగా వెంకట్ మాట్లాడారు.



వీరవాసరంలో సంక్రాంతి క్రీడల పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఆటల్లో యువతను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - వీరవాసరం

సంక్రాంతి సందర్భంగా కళలు, ఆటలు వంటి నైపుణ్యాలను గుర్తించి యువతను ప్రోత్సహించాలని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు అన్నారు. సంక్రాంతి సందర్భంగా శుక్రవారం వీరవాసరంలో పాటల పోటీలు, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కబడ్డీ, లెమన్ అండ్ స్పూన్, రన్నింగ్, మ్యూజికల్ ఛైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆంజనేయులు మాట్లాడుతూ సంక్రాంతి అంటే వేర్వేరు అర్థాలను తీసి ప్రజాప్రతినిధులే పక్కదారి పట్టించే సంస్కృతి ప్రారంభమైందని, ఇది బాధాకరమైన విషయమని తెలిపారు. చాలా ఏళ్లుగా యువజన విద్యార్థి ప్రజా సంఘాలు యువతను ప్రోత్సహించే ఆటల పోటీలను గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నాయన్నారు. దేహదారుఢ్యంతో పాటు స్వీయ రక్షణ, అందరూ కలిసిమెలిసి ఉండాలి అనే ఆలోచన స్ఫురించే సాంప్రదాయాలను ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఇంజేటి శ్రీనివాస్ మండల నాయకులు నాగరత్నం, సత్యవతి, శాంతి కుమారి, ప్రసన్న, బేబీ పాల్గొన్నారు.

వాండ్రంలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - ఉండి

ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రతి ఒక్కరూ మెరుగైన వైద్యాన్ని పొందాలని పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ బి.సాయిచంద్ర అన్నారు. శుక్రవారం మండలంలోని వాండ్రం గ్రామంలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ సాయిచంద్ర మాట్లాడుతూ గ్రామంలో ఉదయం వైద్య సదుపాయం అవసరమైన వారికి వైద్య సేవలు అందించి మధ్యాహ్నం సమయంలో మంచం బారిన పడిన రోగులకు సేవలందించడం జరుగుతుందని అన్నారు. ప్రస్తుతం డెంగీ జ్వరాలు ఎక్కువగా వ్యాపిస్తున్నాయని, డెంగీ లక్షణాలు కనబడితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందిని సంప్రదించి వైద్య సదుపాయం పొందాలని ఆయన సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు అందించడం వల్ల రోగులు సుదూర ప్రాంతాలకు వెళ్లి వేలాది రూపాయలు వెచ్చించాల్సిన అవసరం లేకుండా ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఆపన్నులకు అండగా సిఎంఆర్ఎఫ్

ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్ఎఫ్) ఉపయోగపడుతుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానికంగా తన క్యాంపు కార్యాలయంలో నలుగురు లబ్ధిదారులకు రూ.9,93,265 సిఎం సహాయ నిధి చెక్కులను ఎంఎల్ఎ అంజిబాబు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తుందన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎంఆర్ఎఫ్ నిధులు అందిస్తున్నామన్నారు. అనంతరం కొత్త పూసలమర్రుకు చెందిన మోకా రజనీశ్రీ, మోకా లక్ష్మి, దుర్గాపురానికి చెందిన పుప్పాల కృష్ణ, రాయలంకు చెందిన కోళ్ల రత్నకుమారి, భీమవరానికి చెందిన మామిడి శ్రీరాములకు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, జనసేన పట్టణాధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, యర్రంశెట్టి శివకృష్ణ, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు సిఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

రేపు సూపర్ సిటిజన్స్‌కు సన్మానం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ ఆడిటోరియంలో ఈ నెల 19వ తేదీ ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు సూపర్ సిటిజన్స్‌కు సత్కరిస్తున్నట్లు ఆ సంఘ అధ్యక్షులు వంగా నరసింహారావు తెలిపారు. పాలకొల్లు పట్టణానికి మాజీ మంత్రి చేగొండి హరరామ జోగయ్య, మాజీ ఎంఎల్ఎలు అల్లు వెంకట సత్యనారాయణ, డాక్టర్ సిహెచ్.సత్యనారాయణమూర్తి (బాబ్జీ)లను ఘనంగా సత్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు విచ్చేస్తారన్నారు. ఈ సభలో రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ సంఘ అధ్యక్షులు వెంపరాల నారాయణమూర్తి, పాలకొల్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కారుమూరి వెంకట నరసింహారావు, స్థానిక శాఖ గౌరవాధ్యక్షులు వేగేశ్న తిరుపతిరాజు సన్మానకర్తలుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేవలం సీనియర్ సిటిజన్ కళాకారులచే 'కళాతరంగిణి' అనే పేరుతో వినోద కార్యక్రమాలు ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో అంతా పాల్గొని జయప్రదం చేయాలని కార్యదర్శి గుత్తుల సత్యనారాయణమూర్తి కోరారు.

మాజీ సర్పంచి నల్లయ్య హత్య

ప్రజాశక్తి - కలిదిండి

పాత కక్షల నేపథ్యంలో మండలంలోని సంతోషపురం గ్రామ మాజీ సర్పంచి కాల్వ నల్లయ్య(55) హత్యకు గురయ్యారు. శుక్రవారం కైకలూరు రూరల్ సిఐ రవికుమార్, ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. వివరాల ప్రకారం సంతోషపురం, భోగేశ్వరలంక మార్గ మధ్యలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. బైక్‌పై వెళుతున్న నల్లయ్యపై దాడి జరిగింది. తలపై బలమైన గాయాలవ్వడంతో తొలుత స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం భీమవరం ప్రయివేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడు కాల్వ నల్లయ్య గ్రామ సర్పంచిగా, ఎంపిటిసిగా పనిచేశారు. మృతునికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, భార్య అన్నారు. మృతుని కుమారుడు ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు.

వినియోగంలోకి ఎటిఎం, సిడిఎం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో ఎస్‌బిఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎటిఎం, సిడిఎం ఎట్టకేలకు వినియోగంలోకి వచ్చాయి. ముదినేపల్లిలోని ఎస్‌బిఐ ఎటిఎం, సిడిఎం తరచూ మొరాయిస్తూ ఖాతాదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. ఎటిఎం, సిడిఎం గత కొన్ని రోజులుగా పనిచేయకపోవడంతో ఖాతాదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ సమస్యపై గురువారం ప్రజాశక్తి దినపత్రికలో ఎటిఎం ఎనీ టైం మరమ్మతులు అనే శీర్షికతో వార్త వెలువడిన విషయం పాఠకులకు విధితమే. దీనిపై స్పందించిన బ్యాంకు అధికారులు గురువారం సాయంత్రానికి ఎటిఎం, సిడిఎంలకు మరమ్మతులు చేపట్టారు. దీంతో రెండు మిషన్లు వినియోగంలోకి వచ్చాయి. దీంతో వినియోగదారులు ఎటిఎంకు వచ్చి నగదు డ్రా చేసుకుంటూన్నారు. ఎటిఎం, సిడిఎం వినియోగంలోకి రావడంతో ఖాతాదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పోలిశెట్టి వారి ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని తెలగా కళ్యాణ మండపంలో శుక్రవారం పోలిశెట్టి వారి కుటుంబ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దేశంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు పెద్ద ఎత్తున పోలిశెట్టి కుటుంబీకులు తరలివచ్చారు. ముందుగా ఒకరికొకరూ పరిచయాలు చేసుకొని యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం వరకూ కళ్యాణ మండపంలో వారంతా కుటుంబ సభ్యులతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం పోలిశెట్టి శ్రీనివాస్, తదితరులు పెద్దలను ఘనంగా సత్కరించారు. పోలిశెట్టి కుటుంబీకులు తొలిసారిగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్థికంగా స్థిరపడిన వారంతా వెనుకబడిన వారికి పోలిశెట్టి వాసులు అండగా నిలవాలని తీర్మానించారు. అనంతరం మహిళలకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పోలిశెట్టి శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ప్రసాద్, వాసు, గణేశ్వరరావు, నళిని, సత్తిబాబు, సాంబ పాల్గొన్నారు



ఆత్మీయ సమ్మేళనంలో పోలిశెట్టి వారి కుటుంబ సభ్యులు

ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని ప్రజలు, వ్యాపారులు ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజలు, వ్యాపారులు తడిపొడి చెత్తను వేరు చేసి డస్ట్ బిన్లలో వేసి శానిటరీ సిబ్బందికి అందించాలన్నారు. అలాగే ఇష్టానుసారం రోడ్లపై, డ్రెయినేజీలు, ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేడు రక్తదాన శిబిరం

నరసాపురం:టిడిపి వ్యవస్థాపకులు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం స్టీమర్ రోడ్డులో ఉదయం 9.30 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు తెలిపారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఎన్‌టిఆర్ చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. పార్టీ శ్రేణులు హాజరుకావాలని వారు కోరారు.

రేపు చర్లపల్లికి ప్రత్యేక రైలు

నరసాపురం: సంక్రాంతి పండుగకు ప్రయాణీకుల రద్దీని పరిగణలోకి తీసుకుని ఈనెల 19న ఆదివారం నరసాపురం నుంచి చర్లపల్లికి ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు స్టేషన్ మేనేజర్ మధుబాబు చెప్పారు. ఈ రైలు నరసాపురంలో రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7 గంటలకు చర్లపల్లికి వెళ్తుందన్నారు. పాలకొల్లు, భీమవరం టౌన్, జంక్షన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, ఖమ్మం, వరంగల్ మీదుగా చర్లపల్లి వెళ్తుందన్నారు.

నరసాపురంలో అన్నదానం

నరసాపురం:మండలంలోని గంగాలమ్మ అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా శుక్రవారం ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి యాత్రికులు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. సుమారు 15 వేల మందికి పైగా అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ముందుగా అమ్మవారిని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, పులపర్తి వెంకటేశ్వరరావు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ మేకల సతీష్ దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైలు కింద పడి వృద్ధుడు ఆత్మహత్య

భీమవరం టౌన్: అనారోగ్యం కారణంగా మనస్తాపానికి గురైన వృద్ధుడు పట్టణ పరిధిలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి రైల్వే పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకొల్లు మండలం లంకలకోడేరు సమీపంలోని వెదుళ్లపాలేనికి చెందిన మాధు వెంకటేశ్వరరావు (66) శుక్రవారం ఉదయం నరసాపురం నుంచి నాగర్‌సోల్ వెళ్లే రైలు కింద పడి టౌన్ రైల్వే స్టేషన్ పరిధిలో ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై జిఆర్‌పి హెడ్ కానిస్టేబుల్ జి.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలు, పేకాట శిబిరాలపై దాడి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని పాలకొల్లు రూరల్, యలమంచిలి, పోడూరు మండలాల్లో కోడి పందేలు, పేకాట శిబిరాలపై దాడులు నిర్వహించినట్లు రూరల్ సిఐ గుత్తుల శ్రీనివాసరావు తెలిపారు. ఈ దాడుల్లో మొత్తం 45 కేసులు నమోదు చేసి 104 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రు.72,430 నగదు స్వాధీనం చేసుకున్నామని పాలకొల్లు రూరల్ సిఐ శ్రీనివాస్ తెలిపారు.